క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ

గోపాలపురం: మండల కేంద్రంలో నేడు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు పార్టీ సీనియర్ నాయకుడు కూసం రామమోహన్ రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్ర హోంమంత్రి, నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కావున మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ సర్పంచ్, ఎంపీటీసీలు, అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

21న తపాలా సేవలు బంద్


డివిజన్ సూపరిండెంట్ కృష్ణ

నల్లజర్ల: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో తపాలా సేవలను డిజిటలైజేషన్ చేస్తున్నట్టు తాడేపల్లిగూడెం డివిజన్ సూపరిండెంట్ కే.కృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పరిధిలో అన్ని పోస్టాఫీసులలోను ఈ సౌకర్యాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 21న డివిజన్ వ్యాప్తంగా అన్ని తపాలా కార్యాయాలలో ఎటువంటి లావాదేవీలు జరగవన్నారు. ఈ విషయాన్ని ఖాతాదారులు గమనించి సహరించాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సజావుగా, సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆరోజు ట్రయల్ వేస్తున్నట్టు చెప్పారు. పెరుగుతున్న సాంకేతికకు అనుగుణంగా తపాలాశాఖలో కూడ వినూత్నమైన సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించేందుకు 'డాక్ సేవా యాప్' అందుబాటులోకి వచ్చిందన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా మైదానంలో ఆదివారం ఫుట్‌బాల్ సీనియర్స్ విభాగం బాలుర జిల్లా జట్టు ఎంపికకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వి.రాజశేఖర్, కార్యదర్శి సీహెచ్ శేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పోటీలు జరుగుతాయని, పదహారు సంవత్సరాలు వయస్సు దాటిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చునని ఆయన వివరించారు. ఆధార్ కార్డు కలర్ జిరాక్స్, పుట్టిన తేదీ లేదా పదో తరగతి మార్కుల జాబితా కలర్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 86882 24728 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

టీడీపీ అధికార ప్రతినిధి రాజీనామా

నిడదవోలు: టీడీపీ రాజమండ్రి పార్లమెంటరీ అధికార ప్రతినిధి సమిశ్రగూడెం గ్రామానికి చెందిన బుగ్గే శివరామకృష్ణ శాస్త్రి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. నిడదవోలు నియోజకవర్గం టీడీపీలో కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు లేని చోట ఉండాలనుకోవడం సమంజసం కాదన్నారు. అందుకే పదవితో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 2024లో కొవ్వూరు మాజీ టీడీపీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు సమక్షంలో క్రియాశీల సభ్యత్వం తీసుకున్న నాటి నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేశానని, పార్టీ పెద్దలు సరైన గుర్తింపు ఇవ్వడం లేని కారణంగానే రాజీనామా చేశానన్నారు.

పట్టణాభివృద్ధికి నిరంతర కృషి

నిడదవోలు: పట్టణాభివృద్ధికి అన్ని విధాలుగా నిధులు సమీకరణకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 15వ ఆర్థిక సంఘం, రుడా నిధులు రూ.147.40 లక్షల అంచనా వ్యయంతో పట్టణంలోని 9, 10 వార్డుల పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి వీక్లీ మార్కెట్ జంక్షన్ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మంత్రి దుర్గేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి పురపాలక శాఖ మంత్రి నారాయణ రూ.కోటి రూపాయలు మంజూరు చేస్తే, ఆ నిధులు సరిపోవని రూ.3 కోట్లు కేటాయించాలని కోరానన్నారు. అయన మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారని త్వరలోనే రూ.2 కోట్ల నిధులు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జాయింట్ కలెక్టర్ చిన రాముడు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కమిషనర్ టి.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ కళాశాలలో జాబ్ మేళా

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో సెంటర్ ఫర్ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. దివిస్ కంపెనీ ప్రతినిధులు సీహెచ్ పూర్ణ హరిప్రసాద్, కె.శరత్, హెచ్ఆర్ తదితరులు హాజరై, సుమారు 60 మంది అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చూపిన వారికి త్వరలోనే నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- జోరుగా అమ్ముడవుతున్న విగ్రహాలు
- అడ్వాన్సులు చెల్లించి బుకింగ్
- కళాకారులకు చేతినిండా ఉపాధి


విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు అనిల్


కొలువుతీరుతున్న గణనాథులు

నల్లజర్ల: చిన్న,పెద్ద తేడా లేకుండా అంతఏకమై సంతోషంగా జరుపుకునే పండుగ వినాయక చవితి..అన్ని విఘ్నాలను తొలగించి చేయబోయే కార్యం సిద్ధించేలా ఆ గణనాథుడు రక్షిస్తాడని హిందువుల ప్రగాఢ విశ్వాసం.. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది ఆ గణనాథుల మండపాలు, గణేష్ రూపాలు..ప్రజలు ఎంతో ఉత్సాహంతో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుని భక్తి భావంతో.. భక్తి ప్రపత్తులతో ఈ పండుగ వేడుకలు జరుపుకుంటారు. యేటా దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేస్తారు. ఇక ఈ విగ్రహాల తయారీలతో ఎంతో కళాకారులు ఉపాధి పొందుతున్నారు. కొందరు వంశపారపర్యంగానూ..ఈ విగ్రహాల తయారీని అందిపుచ్చుకుంటూ జీవనం సాగస్తున్నారు. వచ్చే ఆగస్టు 27 వ తేదిన వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందుకు వినాయక కమిటీలు, నిర్వాహకులు, యువకులు పల్లెల్లో పోటాపోటీగా ఏర్పాట్లు చేయడానికి బొమ్మల కోసం వెతుకులాడే పనిలో ఉన్నారు. ముందుగానే మంచి బొమ్మలు ఎంపిక చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. లేకుంటే చివరి క్షణంలో ప్రత్యేకంగా తయారైన బొమ్మలు దొరకవని చకాచకా అడుగులు వేస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు..

మూడు దశాబ్దాలుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రూపొందించిన గణనాథుని విగ్రహాలను వాడ వాడల ప్రతిష్టస్తుండటంతో వాటి వల్ల పర్యావరణ పరంగానే కాకుండా తాగునీరు కలుషితమవుతోంది. దీని పర్యవసానాలు మరిన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా మనకు కనబడుతున్న క్రమంలో ఇకనైనా మట్టి ప్రతిమ, సహజ రంగులతో ఉన్న గణనాథులను పూజించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగిసిన తర్వాత విగ్రహాలను నిమజ్జనం చేయడంతో నీరు కలుషితమై పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదమున్నందున ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని అధికారులు సూచిస్తున్నారు.

నిర్వాహకులపై ఆర్థిక భారం

వినాయక ఉత్సవాలను నిర్వహించాలనే నిర్వాహకులపై గతంలో ఎన్నడు లేనంతగా ఆర్థిక భారం పడుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రతిష్ఠించిన నాటి నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అయ్యే ఖర్చు ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. ఒక వైపు విగ్రహాల ధరలు ఎక్కువగా ఉండటంతో పాటు మండపంలో డేకరేషన్ ఖర్చులు కూడా బాగానే పెరిగాయి. విగ్రహాన్ని ప్రతిష్ఠించిన నాటి నుంచి తొమ్మిదిరోజుల పాటు నిర్వహించే పూజా సామగ్రి, ఇతర ఖర్చులు కూడా భారీగానే ఉన్నాయి.

మండల కేంద్రం నల్లజర్లలో ఇండియన్ బ్యాంకుకు అనుకుని రాజస్థాన్ కళాకారులు చౌక్ మట్టితో విగ్రహాలు తయారు చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడ బొమ్మల తయారీ కేంద్రానికి భలే డిమాండ్ నెలకొంది. ఇక్కడ వినూత్న ఆకృతులతో గణనాధుడి విగ్రహాలను తయారు చేసి ఉంచారు. ఎత్తు, ఆకృతిని బట్టి ధర నిర్ణయించి ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు. వివిధ గ్రామాలలో మూడు నుంచి 8చోట్ల ఉత్సవాలు చేస్తున్నారు. ఆయా మండపాల నిర్వాహకులు ఇప్పటికే తయారీదారులకు అడ్వాన్సులు చెల్లించి విగ్రహాల తయారీ చేయిస్తున్నారు.

200 విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి



వినాయక చవితి ముగిసిన తర్వాత రెండు నెలలు స్వగ్రామం రాజస్థాన్‌కు వెళ్లి వస్తాం. 10 నెలల పాటు ఆంధ్రాలోనే ఉండి విగ్రహాలను తయారు చేస్తాం. మావద్ద ప్రస్తుతం మట్టితో తయారు చేసిన 200 విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. ఆకృతి సైజును బట్టి రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీలు అడ్వాన్సులు ఇచ్చివెళ్లారు. వారికి నచ్చిన విధంగా విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నాం.

సోహన్‌లాల్, విగ్రహాల నిర్వాహకుడు, రాజస్థాన్

జీతాలు ఇప్పించండి సారూ

నిడదవోలు: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న ఆర్పీలకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని శుక్రవారం సీసీ రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు ఆర్పీలు కలిసి ఏకరవుపెట్టారు. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం మరో ప్రాంతానికి తరలివెళ్తుందన్న అనుమానాలను నివృతి చేస్తూ ప్రస్తుత స్థానంలోనే తహసీల్దార్ కార్యాలయం నిర్వహించాలని ఆర్డీవో సుస్మితరాణికి ఆయన సూచించారు. పట్టణంలోని వీక్లీ మార్కెట్ వద్ద ఐ లవ్ అంబేడ్కర్ సర్కిల్‌ను ఏర్పాటు చేసి, ఆ ప్రాంగణానికి డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చౌక్‌గా మారుస్తూ తీర్మానం చెయ్యాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మంత్రికి వినతి పత్రాన్ని అందించారు.

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

నల్లజర్ల: డైట్ కళాశాలలో ప్రవేశాలకు అభ్యర్థుల ధ్రువపత్రాలల పరిశీలన గురువారం నుంచి ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ యం.కమల కుమారి తెలిపారు. 2025–26కు సంబంధించి డీఈఈసెట్‌లో పూర్వపు పశ్చిమ గోదావిరి జిల్లాలో 170మంది అభ్యర్థులు ఎంపికై నట్టు చెప్పారు. వీరిలో 99 మంది డైట్‌కళాశాలకు,71 మంది భీమవరం సీఎస్ఎన్ కళాశాలకు ఎలాట్ చేసినట్టు తెలిపారు. వీరికి దూబచర్ల ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ నెల 17 నుంచి 22 వరకు ధృవపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. తెలుగు,ఆంగ్ల ,ఉర్దూ మాధ్యమాలకు సంబంధించి రెండు టీమ్‌లు పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు.

తల్లులకు వందనం కాదు.. వంచన

- అర్హులకు పూర్తి స్థాయిలో సొమ్ము ఇవ్వకుండా మోసం
- వాగ్దానాల అమలుపై చిత్తశుద్ధి కనిపించడం లేదు


మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: తల్లికి వందనం పేరుతో రాష్ట్రంలో తల్లులను సీఎం చంద్రబాబు మోసం చేశారని, అర్హులైన చాలామంది తల్లులు ఖాతాలకు నేటికి సొమ్ములు జమ కాలేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు మండిపడ్డారు. శుక్రవారం చాగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు రాష్ట్రంలో మొత్తం పిల్లలు 87,41,885 ఉండగా 67,27,164 మందికే ఇస్తామని ప్రకటించారు. కాని ప్రకటించిన నిధులు ప్రకారం చూస్తే 58 లక్షల మందికే నగదు జమ చేశారని, దాదాపు 29 లక్షల మంది పిల్లలను మోసం చేయడమే కదా అని ప్రశ్నించారు.

వంచించడమే లక్ష్యం

ఎన్నిలకు ముందు సూపర్ సిక్స్‌పేరుతో ప్రజలకు హామీలుఇచ్చి, వాటిని అమలు చేయకుండా ఏడాదికాలంపాటు చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా, అరాచకంగా పరిపాలన చేసిందన్నారు. ఏడాది పాలన తర్వాత కూడా, చేసిన వాగ్దానాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కనిపించడంలేదు. ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది అని ఆయన విమర్శించారు. వైయస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ప్రాంతం, మతం, కులం, పార్టీలు చూడకుండా అందరికీ పథకాన్ని వర్తింప చేశామన్నారు. అప్పట్లో రూ.1,000 పాఠశాల నిర్వాహణ ఖర్చులకై కట్ చేస్తే గగ్గోలు పెట్టి, ఆంక్షలు లేకుండా రూ.15,000 ఇస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు రూ.2,000 కట్ చేసి ఇవ్వడం తల్లులను వంచించడం కాదా అని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నియోజకర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో కుమ్ములాటలు


పెద్దేవంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడిలను చుట్టుముట్టిన జనసేన యువకులు

తాళ్లపూడి: పెద్దేవం గ్రామంలో డ్రెయిన్ సమస్యను పరిష్కారించాలని ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులను జనసేన యువకులు గుండేపల్లి స్వామిజీ, శ్రీహరి, సిద్ధంశెట్టి సత్యానారాయణ, మధు తదితరులు చుట్టుముట్టారు. మండల పరిధిలోని శుక్రవారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిమిత్తం వచ్చిన నాయకులను తమ సమస్యలను పరిష్కరించాలని గత కొలంగా కొరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పోలీసులు వారిని నిలువరించినప్పటికీ కొంత ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. గ్రామంలోని డ్రెయిన్లలో పూడిక తీసి వదిలివేశారని, దింతో ఇబ్బందులు పడుతున్నామని, పలు చోట్ల డ్రెయిన్లు లేక మురుగునీరు పారక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తామంతా ఎన్నికల సమయంలో కూటమి విజయానికి కష్టపడి పని చేశామని అయినా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రొటోకాల్‌పై వివాదం

తాళ్లపూడి మండలంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులు ప్రారంభించే అభివృద్ధి పనుల నిమిత్తం భూమి పూజ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం వివాదాలకు నిలయంగా మారింది. శిలాఫలకంపై ప్రొటోకాల్‌కి సంబధం లేని వ్యక్తుల పేర్లు ఉండటంపై గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణలు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నగడ దసుబ్బరాయ చైదరి, కంతమణి రామకృష్ణ, ఆంధ్రా షుగర్స్ ఎండీ, టీడీపీ నాయకులు పెండ్యాల అచ్చుతరామయ్య పేర్లు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే పనులకు పంచాయతీలో తీర్మానం చేయకుండా భూమి పూజ చేయటం వంటి అంశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరామని తెలిపారు.


ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌లు

బేధాభిప్రాయాలు సహజం


తాళ్లపూడిలో మంచి నీటి ట్యాంక్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ పురందేశ్వరీ, ఎమ్మెల్యే

తాళ్లపూడి: కూటమిలోని మూడు పార్టీలకు సంబంధించి సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు చర్చించుకుంటున్నామని, కుటుంబం అన్న తరువాత బేధాభిప్రాయాలు ఉంటాయని వాటిని మూడు పార్టీల నాయకులు చర్చించుకుని సరిచేసుకోవాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో శుక్రవారం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని, రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలో ఉన్నందునే సూపరిపాలనకు అవకాశం కలుగుతోందని, ఏపీకి కేంద్రం ఈ సంవత్సర కాలంలో ఎన్నో నిధులు ఇచ్చిందన్నారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు, హడ్కో ప్రాజెక్టులకు 11 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.17,400 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఆర్డీవో రాణి సుస్మిత, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ఆదిలోనే అరికట్టాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మి

నిడదవోలు: బాల్య వివాహాలను ఆదిలోనే అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది బాధ్యతగా పని చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి కోరారు. స్థానిక నెహ్రూనగర్ వార్డు సచివాలయంలో శుక్రవారం బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలను అరికట్టడంలో క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతగా పని చేస్తే ఆదిలోనే అరికట్టవచ్చునన్నారు. ప్రతీ బాలిక 18 ఏళ్లు నిండినంత వరకు వివాహం చేసుకోననే చైతన్యం వచ్చేంత వరకు కిషోర బాలికలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు క్షేత్రస్థాయిలో విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. కౌన్సిలింగ్ ఇవ్వడంతోనే కాకుండా అధికారులందరూ అంకితభావంతో పని చేయాలని ఆమే సూచించారు. ఈ కార్యాక్రమంలో సచివాలయ అడ్మిన్ పేర్రాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యనారాయణ, వీఆర్‌ఓ చిట్టిబాబు, ఆర్. అమ్మిరాజు టీచర్ జ్యోతి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, సంరక్షణకై కమిటీల ఏర్పాటు

ఉండ్రాజవరం: పిల్లల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన వంటి చర్యలపై ప్రధానంగా చైల్డ్ ప్రొడక్షన్ కమిటీలు దృష్టి కేంద్రీకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో ఆశా రోహిణి అన్నారు. మండల పరిధిలోని చిన్నారుల సంరక్షణ కమిటీ, బాల్య వివాహాల నిర్మూలన కమిటి ఏర్పాటుకై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల హక్కులు, బాల్య వివాహాలను అరికట్టేందుకు కమిటీ సభ్యులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామంలో ఇటువంటి సంఘటనలు గుర్తిస్తే ప్రజలు సంబంధిత కమిటీలకు, అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీపుళ్ల కుమారి, ఐసీడీఎస్ సూపర్వైజర్ బాల సరస్వతి, కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలుష్య రహిత వాతావరణం అవసరం

ఉండ్రాజవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బౌద్ధదమ్మ పీఠం పీఠాధిపతి బంతె అనాలియో అన్నారు. మండలంలో మోర్త గ్రామంలోని స్మశాన వాటిక ప్రాంగణంలో శుక్రవారం ఆయన పలురకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడి చివరి మజిలి వరకు కాలుష్య రహిత వాతావరణం అవసరమని, అందుకే స్మశాన వాటిక ప్రాంగణంలో నీడనిచ్చే మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో వనమహోత్సవం పురస్కరించుకుని నెల రోజుల పాటు మొక్కలు పంపిణీ, మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు.

తల్లీ కుమార్తెల అదృశ్యం

సీతానగరం: సింగవరానికి చెందిన తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సబ్బితి కృష్ణంరాజు, మునికన్య భార్యాభర్తలు. వారికి తొమ్మిదేళ్ల సృజన అనే కుమార్తె ఉంది. మునికన్య తన భర్తతో గొడవపడి గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అదే గ్రామంలోని అత్తింటికి వెళ్లి ఆరా తీయగా రాలేదని తెలియడంతో ఆమె భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దేవతమూర్తులకు ఆషాఢం సారె సమర్పణ


దేవరపల్లిలోని సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె


గంగాలమ్మకు ఆషాఢం సారె తీసుకువచ్చిన భక్తులు

దేవరపల్లి: స్థానిక మూడు బొమ్మల సెంటర్లో వేంచేసియున్న సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారు, గోపాలపురం రోడ్డులో పచ్చని పంట పొలాల మధ్య కొలువైయున్న గంగాలమ్మ అమ్మవారికి భక్తులు శుక్రవారం ఆషాఢమాసం సందర్భంగా భక్తి శ్రద్ధలతో సారె సమర్పించారు. ఈ మేరకు పలు రకాల పిండి వంటలు, పండ్లు, చలివిడి, పానకాలు, పసుపు కుంకుమ, చీరలతో గ్రామంలో వైభవంగా ఊరేగించి అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా గంగాలమ్మను వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించి మహిళభక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.

శాకంబరి దేవిగా కనకదుర్గమ్మవారు

ఉండ్రాజవరం: మండల కేంద్రం వెలగదుర్రు రోడ్డులో ఉన్న కొలువైయున్న కనకదుర్గమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు దోనేపూడి సుధాకర్ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి మహిళలు సమూహిక సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గ్రామంలో మహిళలు సారె సమర్పించారు.

పలకరించిన వరుణుడు

నిడదవోలు: పట్టణ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఏకధాటిగా వర్షం కురవడంతో రైతులు ఆనందంతో ఉన్నారు. సుమారు 10 రోజులుగా వర్షం మొహం చాటేయడంతో మెట్ట గ్రామాల్లో రైతులు ఆందోళన చెందారు. ఇప్పటికే వరినాట్లు పనుల్లో నిమగ్నమైన రైతులు పంటలకు పూర్తిస్థాయిలో నీరందక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువగా బోర్లపై వ్యవసాయం చేస్తున్నారు. బోర్ల ద్వారా వచ్చే నీటితోపాటు వర్షాలు తోడవడంతో పంటలు సంవృద్ధిగా పండుతాయి. గత పది రోజుల నుంచి పూర్తిస్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఎండలకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం కురవడంతో కొంత ఉపశమనం లభించింది. పట్టణంలో సాయంత్రం నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో జనజీవనం స్థంభించిపోయింది. పల్లపు రోడ్లన్నీ వర్షపు నీటితో నీటమునిగాయి. పట్టణంలో చినకాశిరేవు, గణపతి సెంటర్, ఎన్టీఆర్ కాలనీ, ఇందిరానగర్, ఎమ్‌వీ నగర్ కాలనీలలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరుబాట

నిడదవోలు: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు పోరుబాట పట్టారు. ఈ 21న నిర్వహించనున్న ఛలో విజయవాడ విద్యుత్ సౌద వాల్ పోస్టర్లను నిడదవోలు డివిజన్ ఈఈ కార్యాలయం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యాక్షుడు కేఎల్ఎస్ రాజు మాట్లాడుతూ 2022 పెండింగ్ బకాయిలు చెల్లించాలని, కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలనే డిమాండ్లపై ఏఈటీసీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 21న విజయవాడ రామపాడు జంక్షన్ నుంచి విద్యుత్ సౌద వరకు నిర్వహించే ప్రదర్శనలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఈ.ప్రసాద బీవీవీ సత్యనారాయణ, ఎస్.త్రిమూర్తులు, ఎ.కుమార్, జి.శంకర్, ఎస్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

తాళ్లపూడి: మహిళలు తమ పరిధిలోని ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని లఘు పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ అధికారి శ్రీనివాస్ కోరారు. తాళ్లపూడి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై మండలంలోని డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యాపార అభివృద్ధికి కావలసిన అనేక రకాల యూనిట్లు పరిచయం చేసి పలు విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఏపీఎం మంగాయమ్మ, డిఆర్‌డీఏ జనార్దన్, ప్రక్కిలంక ఎస్‌బీఐ మేనేజర్ బి.రాజు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు, అన్న దేవరపేట బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పాల్గొన్నారు.